అడవి బిడ్డలకు అండగా ఆర్డీటీ

- చెంచు కుటుంబాలకు ఉచితంగా 24 ఇళ్ల నిర్మాణాలు
- విద్య, వైద్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ


సీబీ తండాలో ఆర్డీటీ సంస్థ నిర్మించిన అధునాతన చెంచుల ఇళ్లు

ఉప్పునుంతల: ఎన్నో ఏళ్లుగా పాలకుల పట్టింపు లేక, ప్రభుత్వ సాయానికి నోచుకోక కటిక దారిద్రంలో మగ్గిన మండలంలోని మారుమూల సీబీ తండా చెంచులకు మంచి రోజులు వచ్చాయి. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సంస్థ వారి సహాయ సహకారం, ప్రోత్సాహంతో చెంచుల జీవన విధానంలో ఎంతో మార్పు వచ్చింది. సంస్థ నుంచి ఆరేళ్ల కిందట చెంచులకు అధునాతన ఇళ్లను నిర్మించి ఇవ్వడంతోపాటు వారి విద్య, వైద్యం తదితర అంశాలపై సంస్థ ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో చెంచులు సంతోషంగా జీవిస్తున్నారు. గతంలో ఇండ్లు సరిగా లేక ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే చెంచులు ప్రస్తుతం గ్రామంలోనే ఉపాధి పనులు, కొంతమంది గతంలో ప్రభుత్వం నుంచి ఇచ్చిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నారు.

చెంచు కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాలు

సీబీ తండాలో మొత్తం 24 చెంచు కుటుంబాల్లో 120 మంది వరకు చెంచుల జనాభా ఉంది. గతంలో చెంచుల కోసం ప్రభుత్వం నుంచి నాసిరకంగా నిర్మించి ఇచ్చిన శిథిలావస్థపు ఇళ్లను పడగొట్టి వాటి స్థానంలోనే ఆర్డీటీ సంస్థ నుంచి 24 ఇళ్లను కొత్తగా నిర్మించి ఇచ్చారు. ఒక్కో ఇంటికి రూ. 2.30 లక్షలు ఖర్చుచేశారు. ఇళ్ల నిర్మాణంలో చెంచులను భాగస్వామ్యులను చేస్తూ నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండ జాగ్రత్త పడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి మంజూరైన నాసిరకం ఇళ్లలో ఇబ్బందులు పడిన చెంచులు ప్రస్తుతం సంస్థ నిర్మించి ఇచ్చిన ఇళ్లలో సంతోషంగా జీవిస్తున్నారు.

వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

దీంతోపాటు సంస్థ నుంచి వెంకటమ్మ అనే చెంచు మహిళకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌గా శిక్షణ ఇచ్చి చెంచులకు జ్వరం వచ్చినా, అనారోగ్యానికి గురైనా ప్రాథమికంగా వాడాల్సిన కొన్ని మాత్రలను ఆమె వద్ద ఉంచి వైద్యంపై తగు శ్రద్ధ తీసుకుంటున్నారు. తండాలో వారానికి ఒక సారి మొబైల్ క్లినిక్‌ను నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నారు. స్థానికంగా వ్యాధి నయంకాని రోగులను సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మన్ననూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు అంబులెన్స్‌లో తీసుకెళ్లి చికిత్సలు చేయిస్తున్నారు. గర్భిణులకు, బాలింతలతోపాటు చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తూ చెంచులను శారీరక పుష్టితోపాటు ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు కృషి చేస్తున్నారు. రాగులు, గుడ్లు, బొబ్బర్లు, పెసర్లు, బెల్లం, పిండి వంటి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

ఆర్థికాభివృద్ధికి చేయూత..

చెంచులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వారికి సహాయం చేసి ప్రోత్సహిస్తున్నారు. రెండేళ్ల కిందట ఒక్కొక్కరి రూ. లక్ష చొప్పున నల్లబోతుల వెంకటమ్మ, దాసరి లింగమ్మ, దాసరి బుచ్చమ్మ అనే ముగ్గురు చెంచు మహిళలకు మేకల పెంపకం కోసం ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా చెంచుల విద్యపట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.చెంచుల పిల్లలను చదువుకోవడానికి ఆర్డీసీ సంస్థ వారు ఆర్థికంగా చేయూతనందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సైదమ్మ, ఇదయ్య అనే చెంచు విద్యార్థులను ఇంటర్ నుంచి సంస్థ వారే ఫీజులు చెల్లించి కర్నూల్, హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాలల్లో చదివించారు. గ్రామంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న చెంచు విద్యార్థులకు స్కూల్ మెటీరియల్, న్యూట్రిషన్ ఫుడ్‌ను అందిస్తున్నారు. గతంలో తాతల నాటి నుంచి ఎవ్వరు పట్టించుకోని చెంచులకు ఆర్డీటీ సంస్థ అన్ని విధాలుగా సహాయ పడుతుండటంతో చెంచులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

సంస్థ సహకారం మరచిపోలేం



ఆర్డీటీ సంస్థ వారు చెంచులకు అన్ని విధాలుగా సహకారం అందజేస్తున్నారు. ఉచితంగా ఇళ్లు కట్టించి ఇచ్చారు. గతంలో రెండు సార్లు ప్రభుత్వం నుంచి ఇండ్లు కట్టిస్తే అవి నిర్మాణాలు పూర్తిచేయకముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆర్డీటీ వారు జ్వరం వచ్చినా, ఏదైనా ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే మందులు ఇస్తున్నారు. దాంతోపాటు పిల్లలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందజేస్తున్నారు. వారి సహకారంతో ఎప్పటికి మరిచిపోలేం.

– నల్లబోతుల చంద్రయ్య, చెంచు, సీబీ తండా

క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని శనివారం ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో తోటల పెంపకానికి ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. ఐదు ఎకరాల కంటే తక్కువగా ఉండాలని వివరించారు. ఆసక్తి గల రైతులు కార్యాలయంలో వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు.

సైబర్‌నేరాలపై అవగాహన



అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సైబర్‌నేరాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ వాసుదేవ్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం తెలపొద్దన్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ వివరాలు చెప్పొద్దని సూచించారు. అదేవిధంగా సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. కానిస్టేబుల్స్ వీరయ్య, ఎన్‌వీరయ్య, గ్రామస్తులు ఉన్నారు.

ఎస్సీలకు రిజర్వ్ చేయాలి



లింగాల: మండలంలోని అంబట్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వ్ చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బంగారయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అంబట్‌పల్లిలో దళిత సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబట్‌పల్లి గ్రామ పంచాయతీగా ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు ఎస్సీలకు సర్పంచి పదవిని రిజర్వ్ చేయలేదని పేర్కొన్నారు. గ్రామంలో 500 వరకు ఎస్సీ జనాభా ఉందని, 400 మంది వరకు ఓటర్లు ఉన్నారని వివరించారు. సమావేశంలో దళిత నాయకులు భీముడు, అశోక్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ అసిస్టెంట్ మృతి

కొల్లాపూర్: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి పగిడిపాల నాగరాజు(50) అనారోగ్యంతో శనివారం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెంట్లవెల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగరాజు ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయానికి డిప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. ఆయన మృతిపై రాజకీయ, ప్రజాసంఘాల, ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

కళాశాల ప్రవేశాల కోసం ఇంటింటి ప్రచారం



బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆ కళాశాల అధ్యాపకులు శనివారం ఇంటింటి ప్రచారంలో నిర్వహించారు. మండలంలోని మహదేవునిపేటలో ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో పదో తరగతి చదివే విద్యార్థుల ఇంటికి వెళ్లి కళాశాల ప్రాధాన్యతను వివరించారు. అధ్యాపకులు సుప్రజాత, మదన్‌మోహన్‌రెడ్డి, ఎండీ గౌస్, నర్సింహ్మా, వెంకటయ్య, పద్మజ, వినోద్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



పెద్దకొత్తపల్లి: మండలంలో జాతీయ హామీ ఉపాధి పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 4323 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. ఆయా గ్రామాల్లో చెరువులోని ఒండ్రుమట్టి తరలింపు, ఎంబ ట్యాక్సీల నిర్మాణం పనులు చేస్తున్నారు. జాబ్ కార్డుల కోసం పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని ఏపీఓ మంజుల పేర్కొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి


కల్వకుర్తి వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో శనివారం వాసవీమాత జయంతి సందర్భంగా వేకువజామున అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్‌చాలిసా గీతా పఠనం, పల్లకిసేవ నిర్వహించి సామూహిక కుంకుమార్చన చేశారు. మహిళలు వాసవీ మాతా పారాయణం పఠనం చేశారు. ఆలయ చైర్మన్ జూలూరు రమేష్‌బాబు, శ్రీధర్, శ్రీనివాస్, జగదీశ్వర్, ఆంజనేయులు, అశోక్, సతీష్ పాల్గొన్నారు.


పెద్దకొత్తపల్లిలో

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో వాసవీకన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను ఆలయంలో శనివారం ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సుదర్శనయాగాన్ని నిర్వహించారు. అమ్మవారికి వెండి కిరీటం సాతాపూర్ ఆర్యవైశ్య సంఘం వారు బహూకరించారు. నాగర్‌కర్నూల్ అర్థం జయశంకర్ రోజారమణీలు వెండి ప్లేటు, శఠగోపం వితరణ చేశారు. నంద్యాల అమరేష్ మకర తోరణం, లక్ష్మణశెట్టి దంపతులు నాగపడుగ, త్రిశూలం, గుర్ర కృష్ణ దంపతులు బొట్టుబిల్ల అమ్మవారికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు, చంద్రమౌళి, సుధాకర్, శంకర్, లక్ష్మీనర్సింహ, కిశోర్, రాజశేకర్, ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో లక్ష్మీపద్మావతి వేంకటేశ్వర దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి, అభిషేకాలు, అర్చనలతో విశేషపూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు, చిన్నారులు, తదితరులు ఉన్నారు.


మన్ననూరులో

మన్ననూర్: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో వాసవీ మహిళా సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారికి అంగపూజ, అష్టోత్తరం, అభిషేకాలు, మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, పద్మజ, ధనలక్ష్మి, సుమతి, ప్రభావతమ్మ, జయమ్మ, భాగ్యలక్ష్మి, పద్మ వెంకటరమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు


పెంట్లవెల్లిలో స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి జయంతి సందర్భంగా శనివారం విశ్వబ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, బ్రహ్మం, ప్రసాద్‌మహేష్, రంగాచారి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో స్వామివారి జీవసమాధి రోజు పురస్కరించుకొని ఆరాధన, హోమం నిర్వహించారు. స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రామచారి, రాజయ్య, మహిళలు, తదితరులు ఉన్నారు.


వెల్దండలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హోమం, పూజలు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రెసిడెంట్ సుదర్శనాచారి, ఎంపీటీసీ సుమలతశేషు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, సువర్ణరామన్‌గౌడ్, నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.


తెలకపల్లి మండలం కార్వంగలో

తెలకపల్లి: మండలంలోని కార్వంగలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవంతోపాటు కుంకుమార్చన, వ్రతాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవాచారి, కృష్ణమాచారి దంపతులు, చిన్నజంగయ్య, రమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటయ్య ఆత్మహత్యకు కారణమైన నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటయ్య ఆటోలో ఓ వృద్ధురాలి ఎక్కి ఆమె చెప్పిన అడ్రస్ దగ్గర దించాడని పేర్కొన్నారు. వృద్ధురాలి సంబంధించిన బంగారం కనిపించకపోవడంతో ఆమె నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఈ మేరకు ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచక్షణారహితంగా ఎస్ కొట్టారని ఆరోపించారు. విచారణ పేరుతో తరుచుగా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకొని వెంకటేష్‌ను భయపెట్టడంతో దీంతో ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఎస్‌ఐని వెంటనే సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో ఆదోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్యం, నవీన్, నర్సింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు



కొల్లాపూర్: పట్టణంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముగ్గురు వ్యక్తుల ఇళ్లలో 14 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ హనుమంతు, డీటీఎఫ్ ఎస్‌ఐ అరుణ ఉన్నారు.

కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167 జాతీయ రహదారి పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సంజీవాపూర్ నుంచి అంకిరావుపల్లి స్టేజి వరకు 40 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి పనులు వేగంగా చేస్తున్నారు. మండల కేంద్రంలోని పసుపులకు వెళ్లే గుట్ట వద్ద రోడ్డు కటింగ్ పనుల్లో నిమగ్నం అయ్యారు. రెండు నెలలో పూర్తి అయ్యే అవకాశం ఉంది.

మహిళా సంఘాలను బలోపేతం చేస్తాం


సమావేశంలో పాల్గొన్న పొదుపు సంఘాల మహిళలు

లింగాల: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఏపీఎం బాలస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల, గ్రామ సంఘాల బలోపేతానికి ఏపీఎం సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి నెల 4, 19వ తేదీలలో జరిగే గ్రామైక్య సమావేశాలకు చిన్న సంఘాల ప్రతినిధులు హాజరై సమీక్షించుకోవాలని ఆయన కోరారు. ప్రతి చిన్న సంఘానికి రూ.10 లక్షల వరకు రుణం ఇచ్చామని తెలిపారు. ఎనిమిది సంఘాల వారు శ్రీనిధి రుణాలు తీసుకున్నారని వివరించారు. పొదుపు సంఘాల పురోగతిని ఎప్పటికప్పుడు లోక్ యాప్‌లో పొందుపర్చాలని బుక్ కీపర్లను కోరారు. ప్రభుత్వం పావుల వడ్డీని ఖాతాలలో జమ చేయాలని మహిళలు కోరారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు మంగమ్మ, ప్రధాన కార్యదర్శి గీత, కోశాధికారి పెంటమ్మ, సీసీ యాదగిరి, వీఓఏ యశోద తదితరులు పాల్గొన్నారు.

వేగంగా యూనిఫాం తయారీ పనులు


చర్లిక్యాలలో కుట్టుమిషన్ కేంద్రం

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని 37 పాఠశాలల విద్యార్థుల యూనిఫాంను తయారుచేసేందుకు ఆయా సంఘాల నాలుగు క్లస్టర్‌లను ఏర్పాటు చేసి సిద్ధం చేశామని ఐకేపీ ఏపీఎం శేఖర్ అన్నారు. మండలంలోని ఆయా పాఠశాలలో 1351 బాలురు, 1578 బాలికలు మొత్తం 2929 మంది విద్యార్థులకు సంబంధించి మహిళా సంఘాల సభ్యులతో మండల కేంద్రంతోపాటు తాడూరు. చర్లిటిక్యాల, మేడిపూర్, ఐతోల్ గ్రామాల్లో కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్క యూనిఫాంకు రూ. 50 లు ఇస్తున్నామని పేర్కొన్నారు.

చినుకు పడితే చిత్తడే


మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సీసీ రోడ్లు చిత్తడిగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలలో వర్షపునీరు నిలిచింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అధికారులు పరిశీలించి నీరు నిల్వకుండ తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


కుమ్మరోనిపల్లిలో ఇళ్ల పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లిలో బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఇళ్ల పక్కనే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళలో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విద్యుత్‌తీగలు కిందకు వేలాడుతున్నాయని అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇతర స్థలంలో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి


గుంతలమయంగా మారిన ఇంద్రకల్, యత్మాతాపూర్ రోడ్డు

తాడూరు: మండల కేంద్రం నుంచి ఇంద్రకల్, యత్మాతాపూర్, తుమ్మలసూర్, కుమ్మెర మీదుగా బిజినేపల్లి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో రోడ్డుపై కంకర తేలింది. వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎన్నో ఏళ్ల కిందట బీటీ రోడ్డు నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని కోరారు.

ఇంద్రధనుస్సు కనువిందు



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ పరిసర ప్రాంతంలో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిసాయి. అదేసమయంలో ఆకాశంలో అర్థ చంద్రాకారంలో భూమిని తాకి ఉన్నట్లుగా ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది. పలువురు ఇళ్ల నుంచి బయటకు వచ్చి తిలకించారు. స్థానికులు సెల్ ఫోన్లలో ఫొటోలు తీస్తూ సంబురపడ్డారు. చిన్నారులు చిరుజల్లులలో తడుతూ కేరింతలు కొట్టారు.

ఉపాధి కూలీల దినసరి వేతనం పెంచాలి


కూలీలతో మాట్లాడుతున్న చింతల నాగరాజు

ఉప్పునుంతల: జాతీయ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల దినసరి వేతనం నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా రోజుకు రూ. 600 పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని వెల్టూరు చెరువులో కొనసాగుతున్న ఉపాధి పనులను ఆయన సందర్శించి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి కూలీల రోజు వేతనం రూ. 300లు ఇవ్వాలని నిబంధన ఉన్నా ప్రస్తుతం కూలీలకు రోజుకు రూ. 180లకు మించి రావడం లేదని ఆయన ఆరోపించారు. వేసవిలో అదనంగా ఇవ్వాల్సిన డబ్బులు కూడా సరిగా కూలీలకు అందడంలేదని అన్నారు. అదేవిధంగా ఉపాధి కూలీలకు రావల్సిన పెండింగ్ వేతనం డబ్బులను వెంటనే అందజేయాలని ఆయన డిమాండ్‌చేశారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి


మాట్లాడుతున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జంగయ్య, రవి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా పదోన్నతులు కల్పించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీల ప్రక్రియను ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని జూన్‌లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కృష్ణయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా భూసేకరణ చేపట్టడం సరికాదు

కొల్లాపూర్: 167కే జాతీయ రహదారి నిర్మాణం కోసం అధికారులు ఇష్టానుసారంగా భూసేకరణ నిర్వహిస్తున్నారని వరిదేలకు చెందిన రైతులు ఇటికెల మేఘనాథ్, రామకృష్ణ, తిరుపతయ్య, రామరాజుయాదవ్‌లు ఆరోపించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మాచినేనిపల్లి శివారులో సెయింట్ మేరీస్ స్కూల్ సమీపంలో ఉన్న తమ భూముల్లో అధికారులు ఇష్టానుసారంగా భూసేకరణ చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారికి ఇరువైపులా సమానంగా భూసేకరణ చేయకుండా తమ భూముల వైపు రోడ్డుకు మధ్య నుంచి వంద ఫీట్ల మేరకు భూమిని తీసుకుంటున్నారని వాపోయారు. దీంతో మా భూముల్లో ఉన్న శ్రీగంధం, ఎర్రచందనం, మలబారు వేపచెట్లతో పాటు, పెద్దమొత్తంలో భూమిని కోల్పోతున్నామన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.